# విద్యార్థుల ముఖాల్లో 'యూనిఫాం' వెలుగులు



4 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



ఖమ్మం
బుధవారం | 26 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 8



# విద్య, వైద్యానికి ప్రభుత్వ ప్రాధాన్యత

- ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలపాలి
- ప్రజాహితం కోసం విద్య, వైద్యానికి పెట్టే ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి
- ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన 50 పడకల

## రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

### క్రిటికల్ కేర్ యూనిట్ ను ప్రారంభించిన మంత్రి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం మంత్రి, స్థానిక జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ. 2375 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాహితం కోసం విద్య, వైద్యం పై పెట్టే ఖర్చు, భవిష్యత్తు పెట్టుబడి అన్నారు.జిల్లాలో వైద్య కళాశాల పూర్తయ్యే నాటికి మనకు ఇంకొక 200 పడకల ఆసుపత్రి కావాలని, అది ఎక్కడ కట్టాలని స్థల నిర్ధారణ చేస్తే, ముఖ్యమంత్రిని అడిగి దాన్ని కూడా మంజూరు చేయిస్తానని తెలిపారు.ఓల్డ్ బిల్డింగ్ శిథిలావస్థలో వుందని,పరిశీలించి, దాన్ని తొలగించడానికి ప్రతిపాదనలు ఇస్తే, మొత్తం స్థలాన్ని

మిగతా 2 లో...

# పెండింగ్ భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిష్కరించాలి

## రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



- భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కోసం భారీగా నిధులు
- ప్రాజెక్టుల పూర్తికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇరిగేషన్ ప్రాజెక్టుల పెండింగ్ సమస్యలపై సమీక్షించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి నిర్దేశిత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో

మిగతా 2 లో...

# నీట్–పీజీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ఆగస్టు 30న 17,627 మంది అభ్యర్థులతో 56 కేంద్రాల్లో నీట్–పీజీ పరీక్ష
- ఎంపిక చేసిన ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతతో అభివృద్ధి చేసి 'బ్రాండ్ తెలంగాణ'ను ప్రపంచ స్థాయిలో బలోపేతం చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్

2 లో...

- పర్యావరణ పరిరక్షణతోనే వేగవంతమైన అభివృద్ధి
- పచ్చదనం పెరిగితే వర్షపాతం, పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుంది
- స్తంభాద్రి అర్బన్ పార్కును ఆహ్లాదకరమైన రిక్రియేషన్ ప్రదేశంగా అభివృద్ధి చేయాలి
- స్తంభాద్రి అర్బన్ పార్కులో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల




# మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

8 లో...

## పెండింగ్ భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిష్కరించాలి




(మొదటి పేజీ తరువాయి...)

ఉన్న భూసేకరణ, పునరావాసం –పునరావాస పునరుద్ధరణ (ఆర్ అండ్ ఆర్), అటవీ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ సమస్యలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేసి,నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.ప్రాజెక్టుల వారీగా అవసరమైన భూసేకరణ, పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌ఆర్ చెల్లింపులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. భూసేకరణను చీఫ్ ఇంజినీర్లు ఒక సవాల్‌గా తీసుకుని యుద్ధప్రాతిపదికన పనిచేయాలని మంత్రి సూచించారు.రెవెన్యూఅధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.భూసేకరణ,ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించిన టోకెన్లను త్వరితగతిన క్లియర్ చేయడంతో పాటు పెండింగ్ అవార్డులను వీలైనంత త్వరగా పాస్ చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ల పీడీ ఖాతాలకు చేరిన నిధులు అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన చేరేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయమైన పరిహారం అందించి భూమిని సకాలంలో సేకరించాలని మంత్రి సూచించారు. భూసేకరణ ప్రక్రియలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి స్థానిక సమస్యలను పరిష్కరించాలన్నారు.సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ,ఆర్‌అండ్‌ఆర్, అటవీ సమస్యల్లో ఎలాంటి అవరోధాలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని, అవసరమైన అంశాలను తన దృష్టికి నేరుగా తీసుకొని రావాలని కలెక్టర్లకు మంత్రి తెలిపారు. కలెక్టర్లు నీటిపారుదల శాఖ కార్యదర్శితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నీటిపారుదల శాఖ సిఇ వాసంతి, ఎస్ఇ ఎం.వెంకటేశ్వర్లు,అధికారులు, పాల్గొన్నారు.

## టైరు బండి తగిలి... యువ రైతు మృతి



**నేలకొండపల్లి, ఆగస్టు 25 ప్రజా జ్యోతి:** రోడ్డు ప్రమాదంలో టైర్ బండి తగిలి యువ రైతు మృతి చెందిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని అమ్మగూడెం గ్రామానికి చెందిన వాసంశెట్టి అఖిల్ (34) అనే యువ రైతు మంగళవారం రాత్రి నేలకొండపల్లి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండుగా... అమ్మగూడెం వద్ద ఉన్న పెట్రోల్ బంక్ సమీపం కు రాగానే చెరుకు సరఫరా చేసే టైర్ బండి యాంగ్లర్ తగిలింది. దీంతో రోడ్డు పై పడటంతో తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు గమనించి 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ హస్పిటల్ కు తీసుకెళ్తుండుగా..మార్గమధ్యలో గోకినేపల్లి సమీపం లోకి వెళ్లగానే మృతి చెందాడు. మృతుడు కు భార్య, ఇరువురు కూమార్తెలు ఉన్నారు. వారిలో ఏడాది పాప తో పాటు ఐదేళ్ల కుమార్తె ఉన్నారు. గ్రామంలో తనకున్న ఎకరంన్నర వ్యవసాయం తో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. స్థానిక ఫ్యాక్టరీలో సీజనల్ లో కార్మికుడు గా విధులు నిర్వహించేవారని సమాచారం. మృతుడు గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు రోధిస్తున్న తీరు వర్ణాతీతం.

# విద్య, వైద్యానికి ప్రభుత్వ ప్రాధాన్యత





(మొదటి పేజీ తరువాయి...)

ప్రణాళికాబద్ధంగా వినియోగంలోకి తెస్తామన్నారు .ఎక్కువ స్థలం ఇంకా మిగిలిపోయింది దాన్ని ఏ రకంగా వాడుకుంటాం ఈ యొక్క హాస్పిటల్ కి సంబంధించినటువంటి వచ్చే బాధితులు, సహాయకులు సౌకర్యవంతంగా వుండేలా చర్యలు చేపట్టాలన్నారు.పార్కింగ్ ఎక్కడ ఉంటే బాగుంటది, బిల్డింగ్స్ మీద సోలార్ కి వెళ్తే మీ పవర్ ఖర్చులు కూడా లేకుండా చూసుకోవచ్చన్నారు.రోగులకి సకల సౌకర్యాలు ఉండాలని,హైదరాబాదులా ఖమ్మం హాస్పిటల్లో అన్ని సౌకర్యాలు దొరుకుతాయి అనే విశ్వాసాన్ని నమ్మకాన్ని ఖమ్మం జిల్లా ప్రజలకే కాకుండా చుట్టుపక్కల జిల్లా ప్రజలకి కల్గించాలని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా అని రంగాలలో అగ్రభాగాన ఉండాలని మంత్రి అన్నారు. రహదారులు, మునిసిపాలిటీ కార్పొరేషన్, హాస్పిటల్స్, విద్యాలయాలు, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, ప్రభుత్వం ఆస్తులు అన్ని తీర్చిదిద్దాలని,అవి వేరే జిల్లా వాళ్ళకి ఆదర్శంగా వుండాలని తెలిపారు. మనం కష్టపడితే ఫలితాలు వస్తాయని, ఆ ఫలితాలు రాష్ట్రం మొత్తానికి వ్యాపిస్తాయని అన్నారు. పట్టణ రహదారులు కూడా అందరిని సమన్వయం చేసుకొని చక్కగా అవుతున్నాయన్నారు. ప్రజల యొక్క అభీష్టం మేరకు వాళ్ళు అవసరాలకు తగ్గట్టుగా కార్పొరేషన్ అభివృద్ధి జరగాలన్నారు. జిల్లా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ కాకుండానే, ఇంకా అవసరమైనటువంటి అన్ని కార్యక్రమాల్ని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నటువంటి వైద్య సౌకర్యాలు మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలన్నారు.రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లగలుగుతానే విశ్వాసంతోటి విద్య, వైద్యం పై చేసే ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడని, ఈ పిల్లలు రేపు ఈ రాష్ట్రానికే కాదు ఈ దేశానికి మనకి ఒక ఆస్తి అని తెలిపారు .డాక్టర్స్ కావచ్చు, ఇంజనీర్స్ కావచ్చు, చదువుకున్నటువంటి ప్రతి బిడ్డ కూడా ఈ దేశం ఆస్తి అందుకనే మనం ఆస్తి మీద పెట్టుబడి పెట్టి ఆస్తిని మనం జాగ్రత్త చేసుకుంటే ఆస్తి ద్వారా ఈ రాష్ట్రం ఈ దేశం సుఖంగా సౌభాగ్యంగా ఉండే అవకాశం ఉంటదని అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ,ప్రభుత్వ ఆసుపత్రుల పటిష్టానికి చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రి లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ దుర్గా ప్రసాద్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.నరేందర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.శంకర్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు, త దిత రులు పాల్గొన్నారు.

# నీట్–పీజీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్–పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నీట్ పీజీ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధి పాలసీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా,కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి పాల్గొన్నారు.రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం లోటు వర్షపాతం నమోదైందని, వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం సెప్టెంబర్ చివరి వరకు పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదని, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు, సాగునీరు, త్రాగునీటి లభ్యత, తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల్లో 17,627 మంది అభ్యర్థులు నీట్–పీజీ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులు నిర్దేశిత రిపోర్టింగ్ సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు,మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, జనరేటర్ బ్యాకప్, వెలుతురు, వెంటిలేషన్ వంటి మౌళిక సదుపాయాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సీఎస్ సూచించారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ కు తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు అభ్యర్థుల గుర్తింపు, ఫ్రిస్కింగ్‌ను నిబంధనల ప్రకారం నిర్వహించాలని



తెలిపారు.మొబైల్ ఫోన్లు,బ్లూటూత్ పరికరాలు,ఏఐ గ్లాసెస్, స్పె కెమెరాలు, తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని, ప్రశ్నాపత్రాల భద్రత, గోప్యతకు పూర్తి రక్షణ కల్పించాలని ఆదేశించారు.ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్, నోడల్ అధికారుల ద్వారా పరీక్షా కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సంబంధిత శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.తెలంగాణను దేశ,విదేశీ పర్యాటకులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తీర్చిదిద్ది తెలంగాణను ప్రపంచస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని తెలిపారు.ప్రతి జిల్లాలోని ప్రత్యేక పర్యాటక ప్రాంతాల పరిధిలో ఉన్న ఆధ్యాత్మిక, చారిత్రక, వారసత్వ, ఎకో టూరిజం, హస్తకళలు, జల పర్యాటక ప్రాంతాలను గుర్తించి, వాటిని అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని సీఎస్ ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలకు రహదారులు, పార్కింగ్, త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, శుభ్రత, సూచిక బోర్డులు, ఇతర సౌకర్యాలను కల్పించాలని సూచించారు .ప్రతి ప్రత్యేక పర్యాటక ప్రాంతానికి స్పష్టమైన అభివృద్ధి కార్యాచరణ, బాధ్యతలు, కాలపరిమితి రూపొందించి పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని సీఎస్ సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్థానిక ఆహారం, సంస్కృతికి ప్రాధాన్యతనిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, హోమ్‌స్టేలు,స్థానిక గైడ్ సేవలను ప్రోత్సహించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల సహజ,చారిత్రక ప్రత్యేకతలను కాపాడుతూ పర్యావరణ హితంగా అభివృద్ధి చేయాలని, ప్రతిజిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాలను ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.తెలంగాణ సంస్కృతి, కళలు, హస్తకళలు, చారిత్రక వారసత్వం, స్థానిక ఆహారం, పండుగలు, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సీఎస్ తెలిపారు. ఫెయిర్లు, ఫెస్టివల్స్, వారసత్వ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి రాష్ట్ర ప్రత్యేకతను చాటాలని సూచించారు. సమగ్ర తెలంగాణ పర్యాటక పోర్టల్, కృత్రిమ మేధ ఆధారిత ప్రయాణ ప్రణాళికలు,రియల్‌టైమ్ డేటా వ్యవస్థల ద్వారా పర్యాటకులకు సులభతరమైన సేవలు అందించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, వ్యర్థ రహిత పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, డిఎంహెచ్‌ఓ డాక్టర్ రామారావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు, పోలీస్, నీట్ పిజీ పరీక్ష సంబంధిత అధికారులు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# యస్.బి.ఐ.టి. ఆధ్వర్యంలో యురేకా - ఐడియా పిచ్చింగ్ ఛాలేంజ్ 2026



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్వర్ణ భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (యస్.బి.ఐ.టి.) , ఖమ్మం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ,సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు ఔత్సాహిక ఆలోచనా విధానాన్ని పెంపొందించే లక్ష్యంతో "యురేకా – ఐడియా పిచ్చింగ్ ఛాలేంజ్ 2026" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచుకునేందుకు ఈ కార్యక్రమం ఒక చక్కని వేదికగా నిలిచిందని, సమాజంలో ఎదురవుతున్న వివిధ సమస్యలను గుర్తించి, వాటికి సాంకేతికత ఆధారిత వినూత్న పరిష్కారాలను రూపొందించి, వాటిని సమర్థవంతంగా ప్రదర్శించేలా విద్యార్థులను ప్రోత్సహించవచ్చని తెలిపారు.ఐ.ఐ.టి. ముంబై ఈ సెల్, నేషనల్ ఎంట్రప్రెన్యువర్షిప్ సెల్, తమ కళాశాల ఇన్నోవేషన్ సెల్ స్పార్క్ ఈ సెల్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి తెలిపారు. ఈ ఛాలెంజ్‌లో "ఐడియా – ఇన్నోవేట్ – ఇంప్యాక్ట్ – ఇన్స్పైర్" అనే నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించారని, విద్యార్థులు తమ ఆలోచనలలో కొత్తదనం, సాధ్యాసాధ్యాలు, అమలు విధానం, సామాజిక ప్రభావం మరియు భవిష్యత్ అవకాశాలను జడ్జింగ్ ప్యానల్ ముందు ప్రదర్శించారని తెలిపారు.వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, వినూత్నమైన ఆలోచనలను ప్రదర్శించారు.ప్రదర్శనలలో సృజనాత్మక ఆలోచనా శక్తి, ఆత్మవిశ్వాసం మరియు సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని ప్రతిబింబించాయని కళాశాల వైస్‌ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఇన్నోవేషన్ మరియు ఎంట్రప్రెన్యువర్షిప్ సాంప్రదాయాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.విద్యార్థులు కేవలం ఆలోచనలకే పరిమితం కాకుండా, వాటిని ప్రోటోటైప్స్, స్టార్టప్ ఆలోచనలు ,సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ ఛాలెంజ్‌లో 106 టీమ్స్ పోటీ పడగా 26 తుది దశకు చేరుకున్నాయని, మొదటి బహుమతిని ఫినోరా, ద్వితీయ బహుమతిని స్మార్ట్‌పిల్ డిస్పేన్సర్, తృతీయ బహుమతిని హెచ్.సి.సి. స్మార్ట్ అటెండెన్స్ సిస్టమ్స్ బృందాలు గెలుపొందినట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ప్యానల్ సభ్యులుగా టాస్క్ ప్రాజెక్ట్ మేనేజర్ బి. బాలు ప్రవరాఖ్య, హైయ్యర్ ఎడ్యుకేషన్ మరియు ఎడ్‌టెక్ ఇన్నోవేషన్ ఎక్స్‌పర్ట్ యమ్. అరుణ్ రెడ్డి, క్లారిటీ ఎడ్ సి.ఈ.ఒ. టి. రాజీవ్ చంద్ర, టెక్ అండ్ ఆపరేషన్స్ లీడ్ కె.సూర్యతేజ తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, ఇన్నోవేషన్ సెల్ ఇన్‌ఛార్జ్ పి. అశ్విని, జి. ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజనం పరిశీలించిన కామేపల్లి స్పెషల్ ఆఫీసర్ అజయ్ కుమార్



**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 25** కామేపల్లి మండలంలోని ఎంపీపీ ఎస్ బండిపాడు కాలనీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగింది. మరియు పాఠశాల కిచెన్ పరిశీలించడం పాఠశాల తరగతి గదులు పాఠశాల ప్రాంగణం మంచినీటి సౌకర్యాలు టాయిలెట్ సౌకర్యము తదితర విషయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది . మధ్యాహ్నం భోజనం నాణ్యత పట్ల పిల్లలను అడిగి వివరాలు తెలుసుకోవడం జరిగింది విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది. విద్యార్థులందరికీ ప్లేట్స్ వాటర్ బాటిల్స్ యూనిఫామ్ అందరికీ ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేయడం జరిగింది పిల్లలకి నాణ్యమైన భోజనం అందించుటకు కృషి చేస్తున్న పాఠశాల హెచ్ఎం మురళీధర్ రెడ్డి ఉపాధ్యాయులు చలపతిరావు సిఆర్పి చందులాల్ మరియు భోజన సిబ్బంది లక్ష్మి స్టాఫ్ అందరినీ అభినందించారు.

# పర్యావరణం పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



**నేలకొండపల్లి, ఆగస్టు 25 ప్రజా జ్యోతి:** పర్యావరణం పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని మంగాపురంతండా సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి పేర్కొన్నారు. మండలం లోని మంగాపురం తండా లో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు...మొక్కలు నాటటం బాధ్యత గా తీసుకోవాలని సూచించారు. నాటటమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. నేడు పెరుగుతున్న కాలుష్యం ను తట్టుకునే విధంగా మొక్కలను పెంపకం వలన వాతావరణం ను కాపాడుకుంటామన్నారు. ప్రభుత్వం మొక్కల నాటే కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రహదారి కి ఇరువైపులా కూడ మొక్కలు పెంచి... పచ్చటి తివాచీ పరిచినట్లుగా రహదారులు ఉండాలని సూచించారు. అందుకు ప్రతీ ఒక్కరూ "సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరువు మాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఆజయ్‌ండా లో పంచాయతీ సర్పంచ్ తేజావత్ శివాజీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పై ప్రభుత్వం స్పందించాలి

- సిఐటియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టరేట్ కు ఎర్రుపాలెం మండల కార్మికులు వెళ్లిన సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ పాలకులు మారినా కార్మికుల సమస్యలు పరిష్కారం అవేదన వ్యాక్తం చేశారు.రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు నర ఏండ్లు అయినప్పటికీ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించలేదని ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ చేయలేదని మండిపడ్డారు.సమస్యల పరిష్కారానికి అనేక సార్లు విన్నవించినా ప్రస్తుతం మండల,జిల్లా కేంద్రాలలో నిరసన దీక్షలు జరుగుతున్నా ప్రభుత్వం ఆస్పందించకపోవడం సిగ్గుచేటన్నారు.ఇప్పటికై రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ, వివిధ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్మికుల అధ్యక్షా కార్యదర్శులు గంతల నాగేశ్వరావు, కలపాల రవీంద్రా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సంజీవరెడ్డి భవన్‌లో ఘనంగా మహ్మద్ జావేద్ 50వ జయంతి వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో స్వర్గీయ మహ్మద్ జావేద్ 50వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ హాజరయ్యారు.పీసీసీ మెంబర్, ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు స్వర్గీయ మహ్మద్ జావేద్ సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.ప్రతిపక్షం లో ఉండి అధికార పక్షానికి ఎదురెళ్లి ఎన్నో ప్రజా సమస్యలపై పోరాడిన రోజులను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు బీహెచ్ రబ్బానీ,షహీలా జావెద్, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు కిలారు అనిల్ కుమార్, ముక్రం అలీ ఖాన్, గాదెల ఝాన్సీ, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, నగర ఓబీసీ సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నాయకులు షేక్ అబ్దుల్ రషీద్,జహీర్ భాయ్, జానీ, కిలారు రమణ, వేల్పుల మురళి, ఫజల్, వెంకట్రావు నాయక్, గడ్డికొప్పుల ఆనందరావు, బెజ్జం గంగాధర్, పర్వత శ్రీనివాస్, పంది రాజు గౌడ్, జొన్నలగడ్డ అరుణ, పేరం యశ్వంత్, బడే మియా, బొమ్మ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# మహ్మద్ తాజుద్దీన్ ఆకస్మిక మృతి

- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ఖమ్మం నగరంలో బి ఆర్ ఎస్ జిల్లా మైనారిటీ అధ్యక్షులు మహ్మద్ తాజుద్దీన్ నిన్న రాత్రి ఆకస్మిక మృతి చెందిన విషయం తెలుసుకొన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావులతో కలిసి తాజుద్దీన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి,మనోధైర్యాన్ని కలిగించాలని ఆదేవుని ప్రార్థించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మహ్మద్ తాజుద్దీన్ గతంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు గా పనిచేశారని,ఎల్లప్పుడూ పార్టీ కార్యక్రమాలలో ముందు ఉండే వారని,ముఖ్యంగా గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో ఆర్ టి సి కార్మికుల సమ్మె రోజులలో నిత్యం పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్,పుచ్చకాయల వీరభద్రం,సయ్యద్ గౌస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల అంజనీ కుమార్, బచ్చల కూర నాగరాజు, రషీద్, ఇసాక్,కిలారు వెంకట రమణ,వేల్పుల మురళి, పంది రాజు గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఈ నెల 27న జాబ్ మేళా నిర్వహణ

- జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం వివిసి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఖమ్మంలో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్,ఆటోమోటివ్ సర్వీస్ అడ్వైజర్,ఆటోమోటివ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు కల్పించుటకు ఆగస్టు 27నే (గురువారం) ఉదయం 10 గంటలకు ఖమ్మం ముస్తఫా నగర్ డిసిసిబి శాంతినగర్ బ్యాంక్ ఎదురుగా ఉన్న వివిసి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్సెస్సి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బి టెక్, బి.ఈ.అర్హత గల 18–28 వయస్సు గల యువతీ, యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకి వేతనం 15 వేల నుండి 18 వేల వరకు ఉంటుందని, ఉచిత శిక్షణ, భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. మొత్తం 90 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి అర్హత గల నిరుద్యోగ యువతీ,యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని,మరిన్ని వివరాలకు హెచ్ ఆర్ సెల్ నెంబర్ 77299–92061 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి మాధవి ఆ ప్రకటనలో తెలిపారు.

## కొనసాగుతున్న స్మార్ట్ కార్డుల పంపిణీ



**నేలకొండపల్లి, ఆగస్టు 25 ప్రజా జ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ కార్డు ల పంపిణీ కార్యక్రమం లో మండలం లో కొనసాగుతుంది. మండలం లోని ఆజయ్ తండా లో పంచాయతీ సర్పంచ్ తేజావత్ శివాజీ చేతుల మీదుగా మంగళవారం కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పూల్సింగ్, జీపీవో జాన్మియా, తేజావత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని పైనంపల్లి లో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ కుక్కల నరేష్, సోసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు, నల్లాని మల్లిఖార్జున్రావు తదితరులు పాల్గొన్నారు. రాజేశ్వరపురం లో సర్పంచ్ దండా రంగయ్య,మాజీ సర్పంచ్ యర్రబోయిన నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- **బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**
- **పల్లె ప్రకృతి వనాన్ని మరింత అభివృద్ధి చేయాలి**
- **కోరిన నాయకులు**
- **పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటే కార్యక్రమం**



**బోనకల్, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో నూతన మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి , ఉప సర్పంచ్ బానోతు కొండ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. రాజేశ్వరి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోత్ జ్యోతి కొండ మాట్లాడుతూ...పల్లె ప్రకృతి వనంలో పచ్చదనాన్ని మరింత పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పార్టీలకు అతీతంగా పాల్గొని మొక్కలు నాటారు.పల్లె ప్రకృతి వనాన్ని మరింత అభివృద్ధి చేసి, మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో బసవోజ్ కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, బీఆర్ఎస్ నాయకులు గుండపనేని సుధాకర్‌రావు, గంగుల పుల్లయ్య, బీజేపీ నాయకులు గుగులోతు నాగేశ్వరరావు, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, సిపిఎం నాయకులు తెల్లాకుల శ్రీనివాసరావు, పంచాయతీ వార్డు సభ్యులు మరీదు శేషు, షేక్ మీరా సాహెబ్, పొటు వెంకటేశ్వర్లు, అంతటి శ్రీను, ఉప్పర శ్రీను, జరపల లావణ్య, మాజీ ఎంపీపీ గుగులోతు శ్రీను, గ్రామ నాయకులు పుల్లారావు, చిట్టోజీ ప్రసాద్, బాజీ షేక్, టైగర్, కాంగ్రెస్ నాయకులు యార్లగడ్డ శ్రీను, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# విద్యార్థుల ముఖాల్లో 'యూనిఫాం' వెలుగులు

- **నాణ్యమైన వస్త్రం.. ప్రత్యేక శ్రద్ధతో కుట్టింపు**
- **స్వయం సహాయక సంఘాల మహిళలతో యూనిఫాంల తయారీ**
- **32,580 మంది విద్యార్థులకు ఇప్పటికే పంపిణీ**
- **కొత్త యూనిఫాంలపై విద్యార్థుల్లో ఆనందం**





**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** కొత్త యూనిఫాం.. కొత్త ఉత్సాహం.. కొత్త ఆత్మవిశ్వాసం. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది అందిస్తున్న యూనిఫాంలు వారి ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తున్నాయి. అత్యుత్తమ నాణ్యత కలిగిన వస్త్రాన్ని సమకూర్చడంతో పాటు,కుట్టింపులోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో యూనిఫాంలు నాణ్యత, సౌకర్యం, ఆకర్షణలో ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

**నాణ్యతకు పెద్దపీట:** ఈ ఏడాది విద్యార్థుల యూనిఫాంల కోసం మంచి నాణ్యత కలిగిన వస్త్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.వస్త్రం ఎంపిక నుంచి యూనిఫాం కుట్టింపు వరకు ప్రతి దశలో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా సరైన కొలతలు, చక్కటి ఫిట్టింగ్‌తో యూనిఫాంలను కుట్టిస్తున్నారు.కొత్త యూనిఫాంలు ధరించి పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు వాటి నాణ్యతపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.యూనిఫాం చాలా బాగుంది. వస్త్రం నాణ్యంగా ఉంది వేసుకుంటే సౌకర్యంగా ఉంది'' అంటూ విద్యార్థులు ఆనందంగా చెబుతున్నారు. ఉపాధ్యాయులు కూడా యూనిఫాంల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.మహిళా సంఘాల చేతుల్లో యూనిఫాంల తయారీలో స్వయం సహాయక సంఘాల మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. తమ కుట్టు నైపుణ్యంతో విద్యార్థుల యూనిఫాంలను నాణ్యతతో తయారు చేస్తున్నారు. విద్యార్థుల కొలతలకు అనుగుణంగా కుట్టడంతో పాటు ఫిట్టింగ్, కుట్టుపని నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.దీంతో ఒకవైపు విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందుతుండగా.. మరోవైపు గ్రామీణ మహిళలకు ఉపాధి,ఆదాయ అవకాశాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం చేపట్టిన కార్యక్రమంలో మహిళా సంఘాల భాగస్వామ్యం స్ఫూర్తిదాయకంగా మారింది.

**68,387 మంది విద్యార్థులకు లక్ష్యం:** జిల్లాలో మొత్తం 68,387 మంది విద్యార్థులకు యూనిఫాంలు అందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 34,850 యూనిఫాంల కుట్టింపు పూర్తయింది. 32,580 యూనిఫాంలను ఇప్పటికే విద్యార్థులకు అందజేశారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ సంక్షేమ విద్యా సంస్థల్లో 20,634 మంది విద్యార్థులకుగాను 19,850 యూనిఫాంల కుట్టింపు పూర్తై, 19,580 యూనిఫాంలు పంపిణీ చేశారు. జెడ్పీ, ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలల్లో 43,775 మంది విద్యార్థులకు యూనిఫాంలు అందించాల్సి ఉండగా, ఇప్పటివరకు 15 వేల యూనిఫాంల కుట్టింపు పూర్తై, 13 వేల యూనిఫాంలు పంపిణీ చేశారు.

**ఒక యూనిఫాం ఎన్నో మార్పులు** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాం అందించడం ద్వారా వారిలో సమానత్వం, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం పెరుగుతున్నాయి. కొత్త యూనిఫాం ధరించి పాఠశాలకు రావడం విద్యార్థుల్లో పాఠశాల పట్ల మరింత ఆసక్తిని పెంచుతోంది.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మార్గదర్శకత్వం లో డిఆర్డిఏ.– సెర్ప్, విద్యాశాఖ, సంక్షేమ శాఖలు, స్వయం సహాయక సంఘాల మహిళలు సమన్వయంతో పనిచేస్తూ యూనిఫాంల కుట్టింపు, పంపిణీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

**విద్యార్థుల ఆనందమే విజయానికి కొలమానం:** నాణ్యమైన వస్త్రం ప్రత్యేక శ్రద్ధతో కుట్టింపు మహిళా సంఘాల భాగస్వామ్యం విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వు. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది పాఠశాల యూనిఫాం కార్యక్రమం విద్యార్థుల సంక్షేమం, మహిళా సాధికారతను కలిపిన ఒక విజయగాథగా నిలుస్తోంది.

## ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తోట

- **శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ నాయకులు**



**బోనకల్, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి):** ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోనకల్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన తోట రామాంజనేయులు మరోసారి ఎన్నికయ్యారు. గతంలో సిపిఐ బోనకల్ మండల కార్యదర్శిగా పనిచేసిన రామాంజనేయులు 2006లో ఏఐఎస్ఎఫ్ వైరా మండల కార్యదర్శిగా ఎన్నిక ఎన్నికయ్యారు. 2008లో ఎఐఎస్ఎఫ్ మధిర డివిజన్ అధ్యక్షులుగా, 2009లో ఏఐఎస్ఎఫ్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొనబడ్డారు. 2011లో ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎన్నిక, 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. 2015లో స్వంత మండలమైన బోనకల్ మండల కార్యదర్శిగా ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2018లో రెండోసారి అదే మండలానికి ఎన్నికతో నియమితులయ్యారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో రామాంజనేయులు అలుపెరుగని విద్యార్థి ఉద్యమ పోరాటాలు నిర్వహించారు. 2009 అప్పటి ప్రభుత్వం విద్యను ప్రవేట్పరం చేసేందుకు జీఓ నెంబరు 75కు వ్యతిరేకంగా మధిరలో పోరాటాలు నిర్వహించి 3 రోజుల పాటు వెళ్లారు. తెలంగాణ ఉద్యమంలో 100 సార్లు పైగా అరెస్టయి వివిధ సందర్భాలలో జైలుకు సైతం వెళ్లడం జరిగింది. ముఖ్యంగా 2012లో జరిగిన హాస్టల్ విద్యార్థుల సమస్యలపై నిర్వహించిన ఆకలికేక కార్యక్రమంలో అరెస్ట్ కావడంతో 12 రోజుల పాటు జైలు జీవితం గడిపారు. బోనకల్ మండల కార్యదర్శి అనంతరం 2022లో అత్యత ప్రతిష్టాత్మకంగా నెలకొండపల్లిలో జరిగిన ఏఐటియుసి 16వ మహాసభలో ఆయన తొలిసారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కార్మిక సంఘం నాయకుడిగా సమర్థవంతంగా పనిచేసిన ఆయనకు అధినాయకత్వం మరొకసారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించడంతో ఆగస్టు 23 ,24 తేదీలలో సత్తుపల్లిలో జరిగిన మహాసభ లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అయిన తర్వాత రామాంజనేయులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 4000 మంది రెండవ ఏఎన్ఎం లను ఏఐటీయూసీలో చేర్చడంతో పాటు ఖమ్మం జిల్లాలో కార్మిక ఉద్యమాలను ఉవ్వెత్తున నిర్వహించారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఎన్నికావడం పట్ల సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు బత్తినేని నీరజ, తూము రోషన్ కుమార్, జక్కుల రామారావు లు సంతోషం వ్యక్తం చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పెళ్లి శుభలేఖ పై యాజమాని ఫోటో

- **- కృతజ్ఞతకు అరుదైన నిదర్శనమిచ్చిన యువకుడు.**



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** తనకు ఉద్యోగమిచ్చి జీవనోపాధి కల్పించిన చేతిని మర్చిపోకుండా జీవితాంతం గుర్తుంచుకునేలా ఓ యువకుడు పెళ్లి పత్రిక పై తన యజమానుల ఫోటోని ముద్రించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. సాధారణంగా పెళ్లి శుభలేఖలపై వధూవరుల ఫోటోలు , దేవతామూర్తులు చిత్రాలు, కుటుంబ సభ్యుల పేర్లు కనిపిస్తుంటాయి కానీ ఎర్రుపాలెం మండలం జమలాపురం గ్రామానికి చెందిన ధరావత్ మణికంఠ తన కుటుంబానికి ఉపాధి కల్పించిన తన యజమానులైన ఖమ్మం నగరానికి చెందిన కేఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, జమలాపురం గ్రామ సర్పంచ్ నిర్మలా కుమారి దంపతుల ఫోటోలను వేసి తన కృతజ్ఞతకు అరుదైన నిదర్శనాన్ని చాటాడు. గత 6 ఏళ్ళ క్రితం మణికంఠకు తన యజమానులు ఖమ్మం లో గల గ్రానైట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం కల్పించారు. ఆ సహాయాన్ని గుర్తుంచుకొని మణికంఠ తనకు ఉపాధి కల్పించిన యజమానిని కేవలం బాస్ గా చూడకుండా తన కుటుంబాన్ని నిలబెట్టుకునేందుకు అవకాశం ఇచ్చిన వ్యక్తులుగా భావించాడు. అందుకే తన పెళ్లి వేడుకకు సంబంధించిన శుభలేఖ పై యజమానుల చిత్రాన్ని ముద్రించి ప్రత్యేకమైన అభిమానాన్ని చాటుకున్నాడు.జీవితంలో ఎదగడానికి ప్రతి ఒక్కరికి ఏదో ఒక సమయంలో ఎవరో ఒకరి సహాయం అవసరం ఉంటుంది.కొందరికి చదువు,మరికొందరికి ఆర్థికసాయం, ఇంకొందరికి ఉద్యోగం రూపంలో తోడ్పాటు లభిస్తుంటుంది. అయితే అత్యంత ముఖ్యమైన సందర్భంలో తిరిగి సహాయం చేసే వ్యక్తులను గౌరవించడం అందరిలో కనిపించదు. కానీ మణికంఠ తనకు ఉపాధినిచ్చిన తన యజమానులు జీవితంలో ముఖ్యమైన రోజున గుర్తుచేసుకోవడం బాధ్యతగా తీసుకున్నాడు. అభిమానం అంటే ఇదే, కృతజ్ఞత దానికన్నా గొప్పదని చాటాడు.కాగా మణికంఠ వివాహం ఈనెల 26న జమలాపురం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో జరగబోతోంది. నాకు పని కల్పించిన వ్యక్తులే నా జీవితంలో ఎంతో ముఖ్యమని ఈ యువకుడు చూపించిన గౌరవం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నిజానికి ఇది అందరు చేయగలిగే పని అయినా దానిలో దాగి ఉన్న అభిమానం,కృతజ్ఞత మాత్రం చాలా పెద్దదిగా కనిపిస్తోంది.

# ఒక్క నిమిషంలో యూరియా మాయం!

- కల్లూరు సొసైటీల్లో కొరతతో రైతుల అవస్థలు.. యాప్‌లో స్టాక్ కనిపించక ఆందోళన




**కల్లూరు, ఆగస్టు 25 : ప్రజా జ్యోతి** కల్లూరు మండలంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొసైటీల్లో యూరియా నిల్వలు ఉన్నట్లు సమాచారం వస్తున్నప్పటికీ, ఆన్‌లైన్ యాప్‌లో బుకింగ్ ప్రారంభించిన కొద్ది నిమిషాల్లోనే స్టాక్ మాయమవుతుండటంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు యూరియా బుకింగ్‌కు సంబంధించిన సమాచారం రైతుల వాట్సాప్ గ్రూపుల్లో పెట్టగా, మధ్యాహ్నం 3 గంటలకు యాప్ ఓపెన్ చేసిన వెంటనే కేవలం ఒక్క నిమిషంలోనే స్టాక్ కనిపించకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

### » అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

కల్లూరు సొసైటీలోనే కాకుండా మండలంలోని పలు సొసైటీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. బంగారం దొరికినా దొరుకుతుందేమో కానీ.. సొసైటీలో యూరియా మాత్రం దొరకడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా కోసం సొసైటీలు, రైతు వేదికల చుట్టూ తిరుగుతూ పేద, చిన్నసన్నకారు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.

### » స్మార్ట్‌ఫోన్ లేని రైతుల పరిస్థితి దయనీయం

ఆన్‌లైన్ బుకింగ్ విధానం వల్ల స్మార్ట్‌ఫోన్ లేని పేద రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని రైతులు అంటున్నారు. ఇతరుల ఫోన్లపై ఆధారపడుతూ సొసైటీలు, రైతు వేదికల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములకు సంబంధించిన రెవెన్యూ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా ఆన్‌లైన్‌లో భూమి వివరాలు నమోదు కాకపోవడంతో ఆయా భూముల్లో సాగు చేస్తున్న రైతులు ఎరువులు ఎలా పొందాలన్నది ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

### » 'యాడింగ్ ల్యాండింగ్'పై అధికారులకే స్పష్టత లేదా?

యాప్‌లో 'యాడింగ్ ల్యాండ్' ప్రక్రియపై క్షేత్రస్థాయి రైతులకు అవగాహన లేకపోవడమే కాకుండా, కొంత మంది అధికారులకు కూడా పూర్తి స్థాయిలో స్పష్టత లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సాంకేతిక సమస్యలు, ఆన్‌లైన్ బుకింగ్ సమస్యలతో రైతులు సతమతమవుతున్నారని తెలిపారు.

### » విత్తనాల కోసం ఆన్‌లైన్.. ఎరువుల కోసం ఆన్‌లైన్.. పంటను పండించేదెలా?

సాగు ప్రారంభం నుంచి ప్రతి దశలోనూ రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. విత్తనాలు ఆన్‌లైన్‌లో ఎలా బుక్ చేసుకోవాలి? ఎరువులు ఎలా పొందాలి? సమయానికి ఎరువులు అందకపోతే వేసిన పంటను ఎలా కాపాడుకోవాలి? పండించిన పంటకు గిట్టుబాటు ధర ఎలా పొందాలి? అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'రైతే రాజు' అంటూ ప్రజాప్రతినిధులు చేసే ప్రసంగాలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయని రైతులు మండిపడుతున్నారు. చిన్న, సన్నకారు రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే గుర్తించి, ఆన్‌లైన్ బుకింగ్ విధానంలోని లోపాలను సరిదిద్దడంతో పాటు సొసైటీల్లో తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా ఎరువుల పంపిణీ జరిగేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## మధిరలో పచ్చదనం పరిమళించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత



**మధిర ప్రజాజ్యోతి** మన నేలను, గాలిని, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటాలని, దాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా భావితరాలకు అందించే గొప్ప కానుకగా భావించాలని కోరారు. మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆమె స్వయంగా పాల్గొని మున్సిపల్ కార్యాలయంలో మొక్కలు నాటి అనంతరం 4వార్డ్ లో మొక్కల పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, చెట్లు మన ప్రాణవాయువుకు మూలాధారమని, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు కనీసం ఒక మొక్కనైనా నాటి, దాన్ని కంటికి రెప్పలా సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మధిర పట్టణాన్ని పచ్చటి హరిత వనంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మున్సిపాలిటీ పరిధిలో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తోందని, నాటిన ప్రతి మొక్కను పరిరక్షించే బాధ్యతను స్థానిక ప్రజలను కలుపుకొని యంత్రాంగం ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. పచ్చదనం పెంపొందించడంలో మధిర పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడతామని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రకృతిని ప్రేమిస్తూ, ప్రభుత్వ పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములయ్యే ప్రతి పౌరుడికి ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సామ్యూల్ పాల్, వైస్ చైర్మన్ కోన ధని కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిన్న మొత్తాల పొదుపు ఏజెంట్ చారుగుండ్ల నరసింహారావుకు ఘన సన్మానం




**మధిర ప్రజా జ్యోతి** మధిర పోస్టల్ సబ్ డివిజనల్ పరిధిలో మధిర శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పోస్టల్ ఇన్స్పెక్టర్ కోటేష్ ఆధ్వర్యంలో అవార్డు ఫంక్షన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఖమ్మం పోస్టల్ సూపరెంటెంట్ వి వీరభద్ర స్వామి విచ్చేసినారు. మధిర ఎస్ఓ, మధిర బజార్ ఎస్ ఓ, ఎర్రుపాలెం ఎస్ ఓ, బనిగళ్ళ పాడు ఎస్ ఓ, సిరిపురం ఎస్ ఓ, బోనకల్లు ఎస్ ఓ పరిధిలో అత్యధిక వ్యాపారం చేసిన పోస్టల్ సిబ్బందికి మరియు ఏజెంట్లకి ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మధిర పట్టణంలో గత 36 సంవత్సరాల నుంచి చిన్న మొత్తాల పొదుపు ఏజెంట్గా పని చేస్తూ అత్యధిక వ్యాపారం చేసిన చారుగుండ్ల వి ఎల్ నరసింహారావుకు ఖమ్మం సూపరెంటెంట్ వి వీరభద్ర స్వామి, పోస్టల్ ఇన్స్పెక్టర్ కోటేష్ గారిచే అప్రిషియేషన్ సర్టిఫికెట్, మెమెంటో మరియు దుశాల్వాతో ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బంధుమిత్రులు, ఖాతాదారులు నరసింహారావు ను అభినందించడం జరిగింది.

## నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు
- గ్రామ సర్పంచి బానోతు జ్యోతి కొండ




**బోనకల్, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి కె. రాజేశ్వరి, డీపీఓ శ్రీనివాసరావు హాజరై అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నూతన రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలకు అతీతంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుండపనేని సుధాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి దుర్గారావు, బీజేపీ పార్టీ నాయకులు గుగులోతు నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు తెల్లాకుల శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ గుగులోతు రమేష్ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. లబ్ధిదారులు నూతన రేషన్ కార్డులు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు మరీదు శేషు, షేక్ మీరా సాహెబ్, పొటు వెంకటేశ్వర్లు, అంతోటి శ్రీను, ఉప్పర శ్రీను, గుగులోతు శ్రీను తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పోక్సో కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు, జరిమానా

- కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌కు సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి ఫాస్ట్‌ట్రాక్ (పోక్సో) కోర్టు గౌరవ న్యాయమూర్తి డా. పుల్లభట్ల పోగడ కృష్ణ అర్జున్ మంగళవారం తీర్పు వెలువరించినట్లు వైరా ఏసీపీ సారంగపాణి తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం చింతకాని మండలంలో 18.11.2022న ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను ఎదురుగా నివాసం ఉంటున్న నిందితుడు మాయమాటలతో తన ఇంటికి తీసుకెళ్లి బెదిరించి, తన ఇద్దరు స్నేహితులతో కలిసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బాలికను బెదిరించారు. దీనిపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతకాని పోలీస్ స్టేషన్‌లో క్రైం నం.152/2023, SC No.87/2023గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఐపీసీ సెక్షన్లు 376, 324, 506 r/w 34 మరియు POCSO Act-2012 సెక్షన్ 5 r/w 6 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించి, దర్యాప్తును పూర్తి చేసి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసులోని సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులపై మోపిన నేరం రుజువైనట్లు నిర్ధారించింది. దీంతో ఎ 1 నుంచి ఎ 3 వరకు ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధించింది. అలాగే ఎ 1కు రూ.65,000, ఎ 2 మరియు ఎ 3లకు ఒక్కొక్కరికి రూ.60,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. నిందితుల వివరాలు: ఎ 1. పాలకుర్తి శ్రీవర్ధన్, 19 సంవత్సరాలు, చింతకాని మండలం. ఎ 2. సిమ్మసార్తి నాగరాజు, 20 సంవత్సరాలు, చింతకాని మండలం. ఎ 3. పాలకుర్తి వీరన్న అభి, 20 సంవత్సరాలు, తిరువూరు మండలం. ఈ కేసులో అప్పటి వైరా ఏసీపీ ఎం.ఏ. రహమాన్ దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె. శరత్ కుమార్ రెడ్డి న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదనలు వినిపించారు. చింతకాని ఎస్ఐ జి. నరేష్ దర్యాప్తులో సహకరించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్‌గా కె.శ్రీనివాసరావు, కోర్టు లైజన్ విధుల్లో ఎస్సై శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుళ్లు డి.నాగేశ్వరరావు, కె. శ్రీనివాస్, ఆర్. నాగేశ్వరావు, హోంగార్డులు ఎం.డి. అయూబ్, యు. చిట్టిబాబు విధులు నిర్వహించారు. కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్, కోర్టు లైజన్ విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన అధికారులను, సిబ్బందిని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## ఆటో బోల్తా... నలుగురికి తీవ్ర గాయాలు

- ఖమ్మం ఆసుపత్రికి తరలింపు

**వేంసూరు ఆగస్టు 25 ప్రజాజ్యోతి** మొక్కలు నాటేందుకు కూలీలను తీసుకెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటన వేంసూర్ మండలం ఎర్రగుంటపాడులో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వేంసూర్ గ్రామంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన సుమారు పది మంది కూలీలు రాయుడుపాలెం శివారులో మొక్కలు నాటేందుకు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో ఎర్రగుంటపాడు సమీపంలో రహదారిపై అకస్మాత్తుగా పిల్లి అడ్డురావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపుతప్పి పల్టీలు కొడుతూ బోల్తా పడింది.ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో ఎనిమిది మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రథమ చికిత్స అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాగత వేడుకలు

- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు
- అందజేసిన రామకోటేశ్వరరావు సరోజినీ దంపతులు



**బోనకల్, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులను ఆహ్వానిస్తూ ద్వితీయ సంవత్సర విద్యార్థులు మంగళవారం స్వాగత వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లింగమనేని నళిని శ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యార్థిని విద్యార్థులు ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది మాట్లాడుతూ... విద్యార్థులు అందరూ కలిసిమెలిసి ఉండాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని, కళాశాలలో క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అదేవిధంగా గత సంవత్సరం జరిగిన ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు చొప్పకట్లపాలెం ఏడు నూతల రామకోటేశ్వరరావు సరోజినీ దంపతులు నగదు పురస్కారాలు అందించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం నుండి లికిత, అభిరామ్, అనిల్ కుమార్, నందిని లు మొదటి స్థానంలో నిలిచినందుకు 2000 రూపాయలను అందించారు. అదేవిధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో భార్గవ్, రాహుల్ సాయి, సంతోష్ కుమార్, సారిక లకు ప్రోత్సాహకంగా 1000 రూపాయలు అందించారు. 2025 మార్చిలో చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి మర్రి అరవింద్ అత్యుత్తమ మార్కులు సాధించినందుకు 2500 నగదు పురస్కారం అందించారు. నగదు పురస్కారాలు అందించిన రామ కోటేశ్వరరావు సరోజినీ దంపతులకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వ్యవసాయ భూమి ఆక్రమణకు యత్నం

- అట్టి వారిపై బోనకల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

**బోనకల్, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన గుడ్డురి వసంత, భర్త వీరబాబు (లేట్), వయస్సు 55 సంవత్సరాలు, వృత్తి వ్యవసాయం అను మహిళకు లక్ష్మీపురం గ్రామ పరిధిలోని 2 ఎకరాల భూమి పట్టా కలిగి అనుభవంలో ఉన్న సాగు భూమిపై అదే గ్రామానికి కొంతమంది ఆక్రమణకు గురి చేసుకుంటున్నట్లు బోనకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన మర్రి పుల్లయ్య, మర్రి పుల్లయ్య భార్య, మర్రి బిక్షం, మర్రి బిక్షం భార్య, మర్రి ఆశీర్వాదం, మర్రి కిరణ్ వారి కుటుంబ సభ్యులు మరికొందరు, ఫిర్యాదుదారురాలి భూమిలో అక్రమంగా ప్రవేశించి, ట్రాక్టర్‌తో దున్ని, నష్టం కలిగించటమే కాకుండా, భూమిలోకి ఎవరైనా వస్తే అంతు చూస్తామని బెదిరించినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బోనకల్ ఎస్సై మాచినేని రవి ఫిర్యాదు స్వీకరించి చట్ట ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులకు ఉద్యానవన శాఖ ప్రత్యేక శిక్షణ తరగతులు



**మధిర ప్రజాజ్యోతి** మున్సిపాలిటీ పరిధిలో గల పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ మడుపల్లి పాఠశాల విద్యార్థులకు ఖమ్మం వ్యవసాయ శాఖ హార్టికల్చర్ ఆఫీసర్ విష్ణు చే మంగళవారం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు ముఖ్యంగా హార్టికల్చర్, దాని యొక్క ప్రాముఖ్యత, హార్టికల్చర్ లో ఉపాధి అవకాశాలు, వ్యవసాయ రంగంలో వినూత్న పద్ధతులు, నీటిపారుదల వివిధ పంటలకు ఏ విధంగా ఉపయోగించాలి అనే అంశాలపై క్షుణ్ణంగా విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నరసింహారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా అగ్రికల్చర్ ట్రేడ్ ఉపాధ్యాయిని ఎం సుష్మ వ్యవహరిస్తూ... విద్యార్థి దశ నుండి వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలని ముఖ్యంగా మన భారతదేశం వ్యవసాయ రంగంలో సవాళ్ళను ఎదుర్కొంటుందని రాబోయే భవిష్యత్తులో ఈ సవాళ్ళ నన్నింటిని సమర్థవంతంగా ఎదుర్కొనే యువతరం మరిన్ని నైపుణ్యాలను సాధించడం కోసం ఇలాంటి ప్రత్యేక శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని ప్రధానోపాధ్యాయులు తోట నరసింహారావు తెలియజేశారు. పాఠశాల విద్యార్థులకు వ్యవసాయరంగం ప్రాముఖ్యతను తెలియజేయడమే కాక, రాబోయే భావితరాలకు వ్యవసాయ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలను చక్కగా వివరించి.. వ్యవసాయంపై విద్యార్థులలో మక్కువ పెంచిన ఉద్యాన శాఖ అధికారి ఏ విష్ణు కి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రైలు నుండి జారిపడి నేపాల్ వలస కూలి మృతి

**బోనకల్, ఆగస్టు 25(ప్రజాజ్యోతి):** రైలు నుండి జారిపడి నేపాల్ వలస కూలీ మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి బోనకల్ – మోటమర్రి గ్రామాల చోటుచేసుకుంది. ఖమ్మం జిఆర్పి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్ వలస కూలీ నేపాల్ నుండి చెన్నై వెళ్తూ గుర్తుతెలియని రైలు నుండి రాత్రి జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఖమ్మం జిఆర్పి పోలీసులు ద్వారా అన్నం పౌండేషన్ కి సమాచారం అందించారు. అన్నం ఫౌండేషన్ వారు ఖమ్మం నుండి అన్నం ఫౌండేషన్ అంబులెన్స్ లో ఘటనా స్థలం వద్దకు చేరుకొని రైల్వే పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద నేపాల్ ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు కార్డు, తను ప్రయాణం చేసే చెన్నై రైల్వే టికెట్ లభ్యమైనట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిఆర్పి హెడ్ కానిస్టేబుల్ కర్రీ శ్రీనివాసరావు, ఆర్పిఎఫ్ ఏఎస్ఐ సలాం, అన్నం పౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులు మినరల్ వాటర్ ఏర్పాటుచేసిన యూత్ నాయకులు



**మధిర ప్రజాజ్యోతి** మండలం పరిధిలోని మహాదేవపురం గ్రామంలోనీ జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాల మరియు ఎంపీపీ ఎస్ స్కూల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి ప్రతిరోజు పరిశుభ్రమైన మినరల్ వాటర్ ను అందించాలని యూత్ నాయకులు చేజర్ల సాయి శివ, గంధం సాయి, కిన్నెర సాయి, పస్తం సురేష్, చేజర్ల సురేష్, పస్తం సాయి వర ప్రసాద్ నిర్ణయించుకున్నారు దీనిలో భాగంగా మంగళవారం రెండు పాఠశాలకు మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు యూత్ నాయకులను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,సాధు సమాధానం లలిత కుమారి ఉపాధ్యాయులు, విద్యార్థి విద్యార్థినులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు యూత్ నాయకులు భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలని మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ జినుగు రాంబాబు, బి ఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సాలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడతాయి

- సర్పంచ్ గంటా తిరుపతమ్మ



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని ములుగుమాడు గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వన మహోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక సర్పంచ్ గంటా తిరుపతమ్మ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు మన జీవనానికి ఎంతో అవసరం. అవి మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుతాయి. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో, నేల కోతను నివారించడంలో మొక్కలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ప్రస్తుతం అడవుల నరికివేత, కాలుష్యం కారణంగా పర్యావరణ సమస్యలు పెరుగుతున్నాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలి. పుట్టినరోజులు, ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని ఆమె చూసించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మైలవరపు సత్యనారాయణ సెక్రెటరీ ఐలూరి రాజశేఖర్ రెడ్డి వార్డు సభ్యులు జిల్లేపల్లి వెంకటరావు గ్రామ పెద్దలు రేలచెర్ల నరసింహారావు రేలచర్ల శ్రీనివాసరావు రేళ్ళ చర్ల జమలయ్య రేలచర్ల శ్రీనివాసరావు రేలచెర్ల నాగేశ్వరావు ఫీల్డ్ అసిస్టెంట్ సిహెచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## మండలంలో ఘనంగా వనమహోత్సవం కార్యక్రమం





**ఎర్రుపాలెం, ప్రజాజ్యోతి** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మన మహోత్సవ కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో మంగళ వారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు లు రాజుల దేవరపాడు గ్రామలోను స్థానిక ఎంపీడీవో శారదా దేవి బనిగండ్లపాడు గ్రామంలో జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని మొక్కలను పెంచి భావితరాల వారికి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని ప్రజలను కోరినారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజులదేవర పాడు సర్పంచ్ పాశం అనూష బనిగండ్లపాడు సర్పంచ్ బలుసుపాటి జయరాజు ఏపీవో కె. నాగరాజు ఏపీఎం హరి నారాయణ వివిధ డిపార్ట్మెంట్లకు చెందిన అధికారులు పాల్గొన్నారు

# పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్ట్ షాపులు..

- పట్టించుకోని అధికారులు



**నేలకొండపల్లి, ఆగస్టు 25 ప్రజా జ్యోతి :** పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది.ఏ పల్లెను వెళ్లినా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా దర్శనమిస్తున్నాయి.అధికారుల నిర్లక్ష్యం వల్ల మద్య మాఫియా గల్లీకో బెల్టు షాపు ఏర్పాటు చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు.నేలకొండపల్లి, మండల కేంద్రాలతో పాటు గ్రామాలలో విచ్చలవిడిగా బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు.అక్రమ బెల్ట్ షాపులు రాజ్యమేలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### » కిరాణా దుకాణాలకు పోటీగా..

గ్రామాలలో నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం కిరాణా షాపులు పదుల సంఖ్యలో ఉంటాయి.గతంలో అక్రమ బెల్ట్ షాపులు అరకొర ఉండేవి. ప్రస్తుతం పెరుగుతున్న జనాభా కనుగూనంగా వివిధ రకాల దుకాణాలు వెలుస్తుండగా మద్యం సేవించడానికి పెద్దలకు దీటుగా యువత అలవాటు పడడంతో గ్రామాలలో కిరణా కొట్లకు మించి బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి. ప్రతిరోజు తెల్లవారకముందే వాటిని తెరిచి అర్ధరాత్రి వరకు ఎలాంటి నియంత్రణ లేకుండా నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.కొందరు మద్యానికి బానిస అయిన వారు టీ కి బదులు వేకువజామునే మద్యం సేవిస్తున్నారు.దీంతో పల్లెటూరి వాతావరణం సైతం దెబ్బతింటుందని ప్రజలు వాపోతున్నారు.

### » యువత మద్యానికి బానిస

గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉండడంతో మద్యానికి బానిస అయిన వారితో పాటు యువత సైతం మద్యానికి ఆకర్షితులవుతూ క్రమంగా బానిస అవుతున్నారు.రోజువారి కూలీలు, నిరుపేద కుటుంబాలకు చెందిన పెద్దలు బానిసలుగా మారి అధికంగా మద్యం సేవిస్తూ తమ ఆరోగ్యాలను చెడిపోవడంతో పాటు జేబులను గుల్ల చేసుకుంటూ అప్పుల పాలవుతున్నారు .మద్యం సేవించిన మందు బాబులను చూసి రోడ్లపై ఒంటరి మహిళలు, యువతులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, విద్యార్థినీ, విద్యార్థులు కూడా ఈ పరిస్థితుల కారణంగా తమ పనుల కోసం వెళ్లేందుకు సైతం జంకుతున్నారు. అక్రమ మద్యం అతిగా మద్యం సేవిస్తూ రాత్రి వేళల్లో గొడవలు గందరగోల పరిస్థితిలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.సంబంధిత అధికారులు తెలిసి తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీస్ శాఖ,ఆబ్కారీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలలో కొనసాగుతున్న అక్రమ మద్యం దందాను అరికట్టాలని..అక్రమంగా వెలిసిన దుకాణాలను తక్షణమే సీజ్ చేసి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగిస్తున్న ఈ అక్రమ వ్యాపారం పై అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి: సిపిఎం డిమాండ్

- ప్రభుత్వ పాఠశాలలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి: సిపిఎం డిమాండ్
- సిపిఎం ఆధ్వర్యంలో పాఠశాలలు పరిశీలన.
- శిథిలావస్థలో తరగతి గదులు.
- అసౌకర్యంగా బాత్రూం.





**పాలేరు ఆర్.సీ ఆగస్టు25 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నాణ్యత ప్రమాణాలు పెంచి, విద్యార్థులకు నాణ్యమైన విద్యాను అందించి ప్రభుత్వ విద్యను కాపాడాలని సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కర్ణబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సిపిఎం గ్రామశాఖ బృందం సభ్యులతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వర్ణ కుమారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య,భోజన, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఎం బృందం సభ్యులు పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో వర్షం వస్తే 3,4,5 తరగతి గదులు కురుస్తున్నాయని,. అలాగే పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం ఒక గదిని కేటాయించగా 1వ తరగతి విద్యార్థులకు తరగతి గది లేక ఒకే తరగతిలో 1వ తరగతి, ప్రీ ప్రైమరీ విద్యార్థులను కూర్చోబెట్టడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందని తెలియజేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మరో 5గురు ఉపాధ్యాయులు ఉండాల్సిన పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయాలతోనే 100 మంది విద్యార్థులకు విద్యా బోధన జరుగుతుందని. బాత్రూంలో సౌకర్యం కూడా లేవని సరిగ్గా లేవని, వంట గదులు కూడా లేకపోవడంతో ఆరు బయటనే విద్యార్థులకు భోజనం వండి పెట్టాల్సి వస్తుందని,బృందం పరిశీలనలో తెలిసిందని. తక్షణమే ప్రాథమిక పాఠశాలలో 3 ఉపాధ్యాయులను, వంట గది, బాత్రూంలను, శిథిలావస్థలో ఉన్న బిల్డింగులను తీసివేసి నూతన బిల్డింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామంలోని హైస్కూల్లో 112 మంది విద్యార్థులకు బాత్రూంలో సరిగ్గా లేకపోవడంతో విద్యార్థిని, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది గురవుతున్నారని, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం కొంత మెరుగుపడాల్సిన అవసరం ఉందని, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందని అలాగే పాఠశాలలోనే వాటర్ ట్యాంక్ దగ్గర అప్రశుద్ధంగా ఉందని, దీంతో దోమలు, ఈగలు వృద్ధిచెంది విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తెచ్చిపెట్టే అవకాశం ఉందని, తక్షణమే సంబంధిత అధికారులు వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాలను శుభ్రపరచాలని, భోజనాల అనంతరం విద్యార్థులు ప్లేట్లు, చేతులు, కడుక్కోవడానికి వాటర్ ట్యాప్ లు కూడా సరిగ్గా లేవని తక్షణమే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి, ప్రభుత్వ విద్యను కాపాడాలని సిపిఎం బృందం సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కంచర్ల జగన్మోహన్ రెడ్డి, గడ్డం మురళిశ, సింగం సోమయ్య సింగం కృష్ణంరాజు ,ఎస్ కే ఖాసీ, తదితరులు పాల్గొన్నారు.

# 27న ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ధర్నాను జయప్రదం చేయండి

- టీ.పీ.టీ.ఎఫ్.జిల్లా అధ్యక్షులు. మల్లయ్య



**పాలేరు ఆర్.సీ ఆగస్టు25 ప్రజా జ్యోతి** కూసుమంచి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం, టీ.జీ.ఈ.జె.ఎ.సీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఆగస్టు 27న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని టీ.పీ.టీ.ఎఫ్. జిల్లా అధ్యక్షులు మల్లయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగాఆయనమాట్లాడుతూఉద్యోగులకు రావలసిన పీ.ఆర్.సీ,డీ.ఎ లను వెంటనే ప్రకటించాలని, సీ.పీ.ఎస్. విధానాన్ని రద్దు చేయాలని, ఆరోగ్య పథకం వెంటనే అమలు చేయాలని కోరారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా పెంచాల్సిన పీ.ఆర్.సీ ,డీ.ఎ లను ఇవ్వకపోవడం వలన ప్రతి ఉద్యోగి కనీసం 20 నుండి 30 వేల రూపాయలు ప్రతినెల పరిస్థితి ఏర్పడుతుందని, పెన్షనర్లు అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.హెల్త్ కార్డుల కొరకు మూడు నెలలుగా ఉద్యోగుల జీతాల నుండి కోత పెట్టినప్పటికీ అమలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు.సమస్యల సాధనకై జిల్లాలో ఈనెల 27 న జరిగే ధర్నాలలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్సినర్స్, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర స్థాయిలోసెప్టెంబర్ 10న హైదరాబాదులో ఆందోళనను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి యాకయ్య, భద్రు, జిల్లా బాధ్యులు భాస్కర్, వీరన్న నరసింహారావు, శంకర్ స్వరూప మండల నాయకులు మదన చారి,నరేష్, శివరాం , సృజన, సలీమా, ఉపేందర్, నవీన్, సాయికుమార్, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 19,20 తేదీలలో ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సమావేశాలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ సమావేశాలు సెప్టెంబర్ 19,20 తేదీలలో బీహార్ రాష్ట్రంలోని బోధ్ గయాలో జరుగుతాయని ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు.అదే విధంగా అక్టోబర్ 28న ఐఎఫ్ డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు దేశవ్యాపిత జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ తో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని జాతీయ కార్యవర్గం నిర్ణయించిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో పాత్రికేయుల రక్షణకు ప్రత్యేక చట్టం, సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జర్నలిస్టుల రైల్వే రాయితీ పునరుద్ధరణ తదితర డిమాండ్ల సాధనకై తలపెట్టిన ఢిల్లీ జంతర్ మంతర్ నిరసనకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జర్నలిస్టులను సమీకరించడం జరుగుతుందని అన్నారు. సెప్టెంబర్ 19,20 తేదీలలో బోధ్ గయాలో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా రాష్ట్రాల అధ్యక్ష,కార్యదర్శులు హాజరవుతారని పేర్కొన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు గోపాల్ మిశ్రా అధ్యక్షతన బోధ్ గయాలో జరిగే ఈ రెండు రోజుల జాతీయ కౌన్సిల్ సమావేశాలలో ఆయా రాష్ట్రాల సమస్యలు, జాతీయ స్థాయి జర్నలిస్టుల సమస్యల పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని మామిడి సోమయ్య తెలిపారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, జర్నలిస్టుల పై జరుగుతున్న దాడులు, రక్షణ చట్టాలు తదితర అంశాలపై జాతీయ సమావేశాలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి వివిధ జిల్లాలకు చెందిన ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారని, అదేవిధంగా అక్టోబర్ 28న ఢిల్లీ జంతర్ మంతర్ లో జరిగే నిరసన ప్రదర్శనకు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులను తరలిస్తామని అన్నారు.

## నేడే పౌర హక్కుల సంఘం 18వ మహాసభ

**పాలేరు ఆర్.సీ ఆగస్టు 25 ప్రజాజ్యోతి** పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా 18వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు విప్లవ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కూసుమంచిలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు పౌర హక్కులపై అవగాహన పెంపొందించేందుకు పౌర హక్కుల సంఘం నిరంతరం పని చేస్తోందని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలు, హక్కుల ఉల్లంఘనలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా 18వ మహాసభలు ఆగస్టు 26న ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని లెనిన్ నగర్‌లోని టీ.పీ.టీ.ఎప్. కార్యాలయం వేదికగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలోని ప్రజా సంఘాలు, పౌర హక్కుల కార్యకర్తలు, ప్రజాస్వామికవాదులు, సామాజిక కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని విప్లవ్ కుమార్ కోరారు. మహాసభల్లో పౌర హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యలు, హక్కుల ఉల్లంఘనలపై చర్చించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మహాసభలకు హాజరు కావాలనిఆయన విజ్ఞప్తి చేశారు.

## ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక హోల్ సేల్ ఫ్రూట్ మర్చంట్ వెల్ఫేర్ యూనియన్ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ని క్యాంప్ ఆఫీస్ కలిసి ఫ్రూట్ మార్కెట్ కోసం స్థలం మార్కెట్ నిర్మాణానికి కావలసిన నిధులు మంజూరు చేసిన సందర్భంగా సన్మానించి ధన్యవాదాలు తెలపడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం మూడు నుండి ఐదు నెలలు పూర్తి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వి హనుమంతరావు వారిని మరియు వైస్ చైర్మన్ తల్లాడ రమేష్ ని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులందరూ పాల్గొనడం జరిగింది.మంత్రి గారిని సన్మానించిన యూనియన్ కమిటీ అధ్యక్షులు గరగ శ్రీనివాస్ అధ్యక్షులు షేక్ జానీ మియా ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ నబి ప్రధాన కార్యదర్శి ఏటుకూరు శ్రీనివాస రావు సహాయ కార్యదర్శి ఎన్ వెంకటేశ్వర్లు కోశాధికారి ఎండి ఉస్మాన్ గౌరవ సలహాదారులు ఏ మల్లికార్జున రావు కమిటీ సభ్యులు షేక్ కరీం షేక్ ఖాసిం లు ఉన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు... వ్యక్తి కి తీవ్ర గాయాలు



**సత్తుపల్లి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** ద్విచక్ర వాహనాన్నికారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సత్తుపల్లి పట్టణ శివారు లో మంగళవారం చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శివారు డబల్ బెడ్ రూమ్ కాలనీకి చెందిన ఆకోజు రామకృష్ణ సెంట్రింగ్ రాడ్ బెండింగ్ వర్క్ పని చేస్తూ, జీవనం సాగిస్తూ ఉన్నాడు. మధ్యాహ్న భోజనం అనంతరం సత్తుపల్లి సెంటర్ వైపు వస్తుండగా,సత్తుపల్లి నుంచి అశ్వరావుపేట వైపు వెళుతున్న కారు వేగంగా బలంగా ఢీకొట్టడంతో బైక్ పై ప్రయాణిస్తున్న ఆకోజు రామకృష్ణ కు తల కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రి కి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం సేవల కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

- పర్యావరణ పరిరక్షణతోనే వేగవంతమైన అభివృద్ధి
- పచ్చదనం పెరిగితే వర్షపాతం, పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుంది
- స్తంభాద్రి అర్బన్ పార్కును ఆహ్లాదకరమైన రిక్రియేషన్ ప్రదేశంగా అభివృద్ధి చేయాలి
- స్తంభాద్రి అర్బన్ పార్కులో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల







**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** మొక్కలు నాటడమే కాకుండా వాటి మనుగడ, సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.స్తంభాద్రి (వెలుగుమట్ల) అర్బన్ పార్కులో మంగళవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రస్తుతం వన మహోత్సవ కార్యక్రమాల్లో మొక్కలు నాటడంపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నామని, అయితే వాటి మనుగడ, సంరక్షణపై కూడా అంతే శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. మొక్క నాటిన ప్రతి ఒక్కరూ దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.అడవుల నరికివేత, పచ్చదనం తగ్గిపోవడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయని మంత్రి తెలిపారు. పసిఫిక్ మహా సముద్రం ఇంతగా వేడెక్కిన పరిస్థితి గత 150 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూ లేదని,రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని అన్నారు.కృష్ణా,గోదావరి,మున్నేరు నదుల్లో ప్రస్తుతం ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహం లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. చరిత్రలో బయ్యారం చెరువు నిండకపోవడం వంటి పరిస్థితి ఎప్పుడూ లేదని, ప్రస్తుతం బయ్యారం చెరువులో కూడా నీరు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వచ్చే ఏడాది త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు.తాను ప్రజా జీవితంలోకి వచ్చిన ప్రారంభ రోజుల్లో వారానికి ఒకసారి నీటి సరఫరా జరిగేదని,ప్రస్తుతం ప్రతిరోజూ త్రాగునీరు అందించే స్థాయికి పరిస్థితులు మెరుగుపడ్డాయని మంత్రి అన్నారు. ప్రజలకు నీరు, రహదారులు, విద్యుత్, మౌళిక వసతులు కల్పించి అభివృద్ధిని వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపు ఎంతో ముఖ్యమని మంత్రి తెలిపారు. పచ్చదనం పెరిగితే వర్షపాతం కూడా మెరుగుపడుతుందని అన్నారు. ఈ ఏడాది అటవీ ప్రాంతాల్లోనే ఎక్కువగా వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు.పట్టణ ప్రాంతాల్లో ప్రజలు పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఖమ్మం ప్రజలు స్తంభాద్రి (వెలుగుమట్ల) అర్బన్ ఫారెస్ట్ వంటి పచ్చని ప్రాంతాలను కలిగి ఉండటం అదృష్టమని మంత్రి అన్నారు. పిల్లలను ఇలాంటి ప్రాంతాలకు తీసుకు వచ్చి వివిధ రకాల చెట్లు,వాటి ఉపయోగాలను పరిచయం చేయాలని సూచించారు.ప్రస్తుత తరంలో అనేక రకాల చెట్లను గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతోందని, పిల్లలకు ప్రకృతి, పర్యావరణంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధిలో మంచి మార్పు సాధ్యమవుతుందని మంత్రి అన్నారు.ప్రజల ఆరోగ్యానికి పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చగా ఉండటం ఎంతో అవసరమన్నారు. చెట్లు లేకపోతే ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును ఆసుపత్రుల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఎన్ని కోట్ల రూపాయల సంపద ఉన్నా పర్యావరణం ఆరోగ్యకరంగా లేకపోతే దాని వల్ల ప్రయోజనం ఉండదని మంత్రి అన్నారు.వన మహోత్సవ కార్యక్రమాల సమయంలో మాత్రమే మొక్కలు నాటకుండా ప్రతి ఒక్కరూ తమ జీవితంలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ఒక అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.క్రమశిక్షణతోనే వ్యక్తిగతంగా, సమాజంగా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని మంత్రి కోరారు.ప్రస్తుతం మనం చేస్తున్న పనులు భవిష్యత్ తరాలపై ప్రభావం చూపుతాయని, వారికి మెరుగైన పర్యావరణాన్ని అందించేందుకు మంచి పనులు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును పిల్లలు, వృద్ధులు, వాకర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలతో ఆహ్లాదకరమైన రిక్రియేషన్ ప్రదేశంగా అభివృద్ధి చేయాలని,ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వృక్షప్రసాదాలు మంత్రి పంపిణీ చేశారు.అంతకుముందు మంత్రి వెలుగుమట్ల పార్క్ ను స్తంభాద్రి అర్బన్ పార్క్ గా నామకరణం,లోగోను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, డిఆర్డీవో శ్రీరామ్,ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు,ప్రజాప్రతినిధులు,అధికారులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.